# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 19, మార్చి 2026


# విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ✳ 10వ తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన
✳ సదుపాయాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి



**బెల్లంపల్లి, మార్చి 18, ప్రభాతవార్త**

10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేలా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరి దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, సరిపడ వెలుతురు, ఫ్యాన్లు, శుచిమందిరాలు వంటి సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. అత్యవసర పరిస్థితుల కోసం అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్. అదనపు మిగతా 2లో..

# షడ్రుచుల ఉగాది..

❖ తెలుగు సంస్కృతికి ప్రతీక ఈ పండుగ.. ❖ ఉగాదికి ఆలయాలు ముస్తాబు
❖ పంచాంగ శ్రవణానికి ప్రత్యేక ఏర్పాట్లు ❖ సాగు పనులకు శ్రీకారం చుట్టనున్న రైతులు

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త :**

తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది. తెలుగు పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది చైత్ర మాసం శుక్ల పక్షం పాడ్యమి తిథి నాడు తెలుగు నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ ఏడాది మార్చి 19వ తేదీ గురువారం రోజున ఉగాది పండగ జరుపుకోనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సాయంత్రం పంచాంగ శ్రవణానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ పండగ రైతులకు ఎంతో ప్రత్యేకం. ఉదయాన్నే పిండి వంటలు వండుకుని, తమ పశుసంప దను పూజించుకుని, నైవేద్యాలు సమర్పిస్తారు. తెలుగు సంస్కృతికి ప్రతీక ఈ పండుగ. ఉగాది రోజున ఒంటికి పసుపు కలిపిన సున్ని పిండితో నలుగు పెట్టుకొని తలంటు స్నానం చేస్తారు. కొత్త దుస్తులు ధరిస్తారు. షడ్రు చుల పచ్చడి సేవిస్తారు. పచ్చడిలో పులుపు (ఆమ్లం), తీపి (మధురం), వగరు (కషాయం), చేదు (పిత్తం), కారం (కటువు), ఉప్పు (లవణం) గుణాలతో కూడిన వేప పువ్వు, లేత మామిడి కాయ, బెల్లం, చింతపండు, ఉప్పు, కారంతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు.

2లో..





## కరెంట్ షాక్‌తో
# యువరైతు మృతి

**దండేపల్లి మార్చి 18 ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని నంబాల గ్రామానికి చెందిన దాసరి చంద్రశేఖర్ (28) అనే యువ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు దండేపల్లి ఎస్సై తహాసీనుద్దీన్ తెలిపారు. అతని కథనం ప్రకారం ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ భూమిలో మోటారును నడుపుతుండగా విద్యుత్ షాక్‌కు గురై చంద్రశేఖర్ మరణించారని ఆయన పేర్కొన్నారు. మృతుడు చంద్రశేఖర్ ఈ సంవత్సరం అదే గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ దగ్గర సుమారు 2 ఎకరాల మిగతా 2లో..

# అంతా మా ఇష్టం..



2లో..

✦ సమయపాలన పాటించని వైద్య సిబ్బంది
✦ పది గంటలు దాటిన పత్తాలేని సిబ్బంది
✦ ఇబ్బందులు గురవుతున్న రోగులు
✦ వైద్య సిబ్బందిపై రోగులు ఆగ్రహం




**వేమనపల్లి, మార్చి 18, ప్రభాతవార్త**

అంతా మా ఇష్టం..! మమ్మల్ని అడిగే వారే లేరు అన్న చందంగా వేమనపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు. సమయపాలన పాటించకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు సరైన సమయానికి రాకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గంటల తరబడి వైద్య సిబ్బంది కోసం ఎదురుచూపులు చూడడం తప్పడం లేదు. దీంతో ఆరోగ్య కేంద్రం వద్ద రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సర్కార్ వైద్యం కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో ఆసుపత్రి సిబ్బంది నీరుగారుస్తున్నారు. ఉదయం 9 గంటల వరకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవలసిన సిబ్బంది బుధవారం ఉదయం 10 దాటిన సిబ్బంది ఎవరూ లేకపోవడంతో రోగులు ఆసుపత్రి ముందు కూర్చుని వైద్య సిబ్బంది కోసం పడిగాపులు కాస్తున్నారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, ఏఎన్ఎంలు సరైన సమయానికి రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పలుమార్లు ఆకస్మిక తనిఖీలు చేసి వైద్య సిబ్బందికి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి మెమోలు ఇచ్చినప్పటికీ సిబ్బంది తీరు మారడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# షడ్రుచుల ఉగాది..

(మొదటిపేజీ తరువాయి)

ఈ పండుగ రోజున సాయంత్రం వేళ ఆలయాల్లో, గ్రామకూడలిలో పంచాంగ పఠనం నిర్వహించడం ఆన వాయితీగా వస్తోంది. పంచాంగం పూర్వ కాలం నుంచి ఒక శాస్త్రంగా భావిస్తూ వస్తున్నారు. గ్రామ పురోహితుడు హాజరై గ్రామ పెద్దలు, పుర ప్రముఖుల మధ్య పంచాంగం వివ రాలను చదివి వినిపిస్తారు. పంచాంగం రానున్న ఏడాది కాలంలో వ్యక్తుల వ్యక్తిగత ఆదాయ, వ్యయాలు, పోకడలతో పాటు దేశప్రాంత సామాజిక పరిస్థితులు, వాతావరణం వంటి విషయా ల్లోనూ అప్రమత్తం చేస్తుంది. వర్షాలు, కరవు కాటకాలు, అరిష్టాల గురించి ఇందులో వివరిస్తారు. నమ్మకాన్ని బట్టి ఈ వివరాలను విశ్వసిస్తారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణం అనే ఐదు అంశాలతో కూడిన పంచాంగ పఠనం వింటే సంపద, ఆయుష్షు, పాపపరిహారం, రోగాలు తొలగడం, చేసే ప్రయత్నాలు ఫలించడం వంటి ఐదు ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతారు.

# అంతా మా ఇష్టం..

(మొదటిపేజీ తరువాయి)



కోతుల దాడిలో గాయపడ్డ వ్యక్తి

నీల్వాయి గ్రామానికి చెందిన టంకశాల వామనరావు కోతులు దాడిచేయడంతో గాయాలు కాగా బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులవు సాయికృష్ణతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. సిబ్బంది ఎవరు లేకపోవడంతో ఎదురు చేశారు. ఉదయం 10 దాటిన వైద్య సిబ్బంది మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ ఎవరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాలేదని, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని జిల్లా ఉప వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విధుల్లో ఉండవలిసిన స్టాఫ్ నర్సులు శివరంజని, రజితలు లేకపోవడంతో వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

### గతంలో జరిగిన ఘటనలు..

2025 జులైలో వేమనపల్లి గ్రామానికి చెందిన కొండగొర్ల సోనియాకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వేమనపల్లి పిహెచ్‌సికి తీసుకురాగా ఆసుపత్రిలో ఏ ఒక్క సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక బెడ్ పై పడుకొని తీవ్రమైన నొప్పులతో విలవిలలాడింది. ఎంతసేపు చూసినా డాక్టర్ రాకపోవడంతో ఆలస్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం ఉందని 108 అంబులెన్స్ లో చెన్నూరు ఆసుపత్రికి తరలించారు.

### శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం: వైద్యాధికారి డా.అన్వేష్



పిహెచ్ సి లో ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు సాధారణ ఓపి సేవలు కొనసాగుతాయని అన్నారు. అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ శివరంజని రిలీవింగ్ స్టాఫ్ నర్స్ రాకముందే విధులనుండి వెళ్లిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. అదేవిధంగా 9గంటలకల్లా విధులకు రావలసిన మరో స్టాఫ్ నర్స్ రజిత 10గంటలు దాటిన రాలేదని ఇరువురికి మెమో జారీ చేసి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇకపైన ఇలాంటి ఘటనలు జరగకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కరెంట్ షాక్‌తో యువరైతు మృతి

(మొదటిపేజీ తరువాయి)

భూమిని కౌలుకు తీసుకున్నారని. చంద్రశేఖర్ హన్మాన్ మాల ధరించడంతో ఎప్పటిలాగే బుధవారం ఉదయం సుమారు 7 గంటలకు ప్రార్థనలు చేయడానికి గ్రామ దేవాలయానికి వెళ్లి ఆ తర్వాత పంటకు నీరు పెట్టడానికి గ్రామం శివార్లలోని కౌలు పొలానికి వెళ్లాడని అయితే చంద్రశేఖర్ ఉదయం 10:30 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో చంద్రశేఖర్ భార్య చంద్రశేఖర్‌కు చాలాసార్లు ఫోన్ చేయగా ఎటువంటి స్పందన రాకపోవడంతో అతనిని వెతకమని తన భార్య అనూష తన మామగారైన దాసరి సత్యనారాయణను పొలానికి పంపగా పొలంలో చంద్రశేఖర్ విద్యుత్ షాక్‌తో చనిపోయి ఉండడాన్ని సత్యనారయణ చూసి కుటుంబ సభ్యులకు తెలియజేయడం జరిగిందన్నారు. మృతుని భార్య దాసరి అనుష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ తెలిపారు.

# విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

తరగతి గదులు మరియు భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అక్కడి 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో పాటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానికి పౌష్టికాహారం అందించాలని, బోధనను సులభంగా అర్థమయ్యే విధంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రామ్‌నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనులను పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పారిశుధ్యం, తరగతి గదుల పరిస్థితి, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలు, బోధన విధానంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. కార్యాలయ టైపిస్ట్ ఎటువంటి సమాచారం లేకుండా గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల భోజనశాలను పరిశీలించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఆర్.ఓ. ప్లాంట్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తంగా విద్యార్థుల సంక్షేమం, పరీక్షల పారదర్శక నిర్వహణ, విద్యాసంస్థల అభివృద్ధిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు.

## ప్రేమ పేరుతో మోసం... గర్భవతిని హత్య చేసిన నిందితుడు అరెస్ట్



**పెంచికల్‌పేట్, మార్చి 18, ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం సమ్మక్క (25)ను ప్రేమ పేరుతో మోసం చేసి గర్భవతిని చేసి, అనంతరం హత్య చేసిన నిందితుడు కేర్కరి జలపతిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జైహిందుర్పూర్ గ్రామానికి చెందిన కేర్కరి జలపతి (33) గత కొన్ని సంవత్సరాలుగా సమ్మక్కతో ప్రేమ సంబంధం కొనసాగిస్తూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భవతిగా మారింది. ఇటీవల సమ్మక్క పెళ్లి విషయమై జలపతిని ప్రశ్నించడంతో, ఆమెను తప్పించుకోవాలనే దురుద్దేశంతో హత్యకు పన్నాగం పన్నాడు. ఈనెల 14వ తేదీ సాయంత్రం సమ్మక్కను జైహిందుర్పూర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై దాడి చేసి, ముక్కు మూసి ఊపిరి ఆడనివ్వకుండా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగజ్ నగర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వాహిదోద్దీన్ పర్యవేక్షణలో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ కుతరలించినట్లు పోలీసులు తెలిపారు.

## 6 గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయకపోవడంపై బీజేపీ ఆగ్రహం

**జైనూర్, మార్చి 18, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా 6 గ్యారంటీలతో పాటు అనేక హామీలను అమలు చేయకపోవడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆకర్షణీయమైన హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి ్మ పథకం, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత వంటి ఆరు గ్యారంటీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెస్రం జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు రాథోడ్ ధర్మేందర్, ప్రధాన కార్యదర్శులు ఆత్రం అర్జున్, మధురాజ్ మడావి, సభ్యులు తుమ్రం దిలీప్ కుమార్, కూర్సెంగా ఆనంద్ రావ్ పాల్గొన్నారు.

## ఇచ్చోడలో ఘనంగా దావతే ఇఫ్తార్

**ఇచ్చోడ, మార్చి 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత నిష్టతో, అల్లాపై భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రార్థనల వల్ల రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీక అని, ప్రజలందరూ ఐక్యమత్యంతో కలిసిమెలిసి పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిత్ ఖాన్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, ఇచ్చోడ సర్పంచ్ జాలై జాకు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నారాయణ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్‌లో సమ్మె

### – ఏఐటీయూసీ హెచ్చరిక
### – నిలిచిపోయిన మెడికల్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
### – శ్రీరాంపూర్‌లో సేవ్ సింగరేణి జాతా ప్రారంభం

**నస్పూర్, మార్చి 18, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల హక్కుల సాధన, సంస్థ పరిరక్షణ ధ్యేయంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ సింగరేణి జాతా బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 7 గనిపై ప్రారంభమైంది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. సంస్థను కాపాడుకోవడంతో పాటు కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు ప్రకటించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడుతూ గత పది నెలలుగా కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహణ నిలిచిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీబీ కేసు పేరుతో యాజమాన్యం కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. అవినీతికి పాల్పడిన బ్రోకర్లపై చర్యలు తీసుకోవాల్సింది పోయి బోర్డునే నిలిపివేయడం వల్ల అనారోగ్యంతో ఉన్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. విధులకు హాజరు కాలేని వారిపై చర్యలు తీసుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు పునరుద్ధరణపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలి. పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్ భారాన్ని యాజమాన్యమే భరించాలి. కొత్త గనులను యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలని స్పష్టం చేశారు. డిస్మిస్ అయిన కార్మికులకు పునర్నియామక అవకాశం కల్పించాలి. మారు పేర్లు, విజిలెన్స్ కేసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లో ప్రారంభమైన ఈ జాతా అన్ని ఏరియాల గుండా సాగి ఈ నెల 30న కొత్తగూడెంలో భారీ ధర్నాతో ముగుస్తుంది. ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో ఏప్రిల్ నెలలో సమ్మెకు వెళ్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం ఆర్.కె 7 గని నుండి భారీ ర్యాలీ నిర్వహించి శ్రీరాంపూర్ సెంటర్‌లో కార్మికుని విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికట్ల వీరభద్రయ్య, వైవి రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, రామడుగు లక్ష్మణ్, బాజీ సైదా, సత్యనారాయణ, మల్లేష్, కిషన్ రావు, కొమురయ్య, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, చంద్రమోహన్, నాగభూషణం, సంపత్, అఫ్రోజ్ ఖాన్, అన్ని గనుల ఫిట్ కార్యదర్శిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిపై అపోహలు తొలగిద్దాం

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 18, ప్రభాతవార్త




మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్ చేతుల మీదుగా కరపత్రాలు, పోస్టర్లు, పాంప్లెట్లు విడుదల చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ గుర్తింపు ఉద్యమం ఈ నెల 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహించబడుతుంది. ఆశా ఆరోగ్య కార్యకర్తల సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరుగుతుంది. కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కలిగే వ్యాధి. ఇది ముఖ్యంగా చర్మం, నరాలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. లక్షణాలు బయటపడటానికి సాధారణంగా 3 నుండి 5 సంవత్సరాలు పడుతుంది. ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. వయస్సు లేదా లింగ భేదం లేదు. ఇది వంశపారంపర్యం కాదు, శాపం లేదా పాపం కాదని వైద్యులు స్పష్టం చేశారు. సరైన సమయంలో గుర్తిస్తే ఎం.డి.టి చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు, అంగవైకల్యాన్ని నివారించవచ్చు అని అన్నారు.

### వ్యాధి లక్షణాలు ఇలా ఉంటాయి...

చర్మంపై సహజ రంగు కంటే తక్కువ లేదా ఎరుపు/రాగి రంగులో మచ్చలు, మచ్చలపై స్పర్శ లేకపోవడం, నొప్పి లేకపోవడం, శరీరంలో ఎక్కడైనా ఈ లక్షణాలు కనిపించడం, ఈ లక్షణాలు ఉన్న వారు ఆశా కార్యకర్తలకు లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఉపకేంద్రాల పరిధిలో రేపటి నుంచి మార్చి 31 వరకు సర్వే కార్యక్రమం నిర్వహించబడుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ రాఘవయ్య, సిహెచ్‌ఒలు కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్, ఆర్ఎస్ పద్మ, డిపిఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కుష్టు వ్యాధి కార్యక్రమం సూపర్వైజర్లు, నోడల్ అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హాజీపూర్, మార్చి18, ప్రభాతవార్త


వెంకటేష్ (ఫైల్)

ముల్కల్ల గ్రామానికి చెందిన బుదారపు వెంకటేష్ (32) అనే యువకుడు వేంపల్లి శివారులో జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 16వార్డు ముల్కల్ల గ్రామానికి చెందిన బుధారపు వెంకటేష్ అనే యువకుడు మంచిర్యాల లో హమాలీ పని చేస్తున్నాడు.ప్రతిరోజూ లాగే బుధవారం రోజు ఉదయం ముల్కల్లలోని ఇంటి నుండి తన యొక్క టీజి 19 6411 నంబరు గల మోటార్ సైకిల్ పై మంచిర్యాల బయలుదేరాడు. మార్గ మధ్యలో వేంపల్లి గ్రామ శివారులో ఎన్‌హెచ్ 63 రోడ్డుపై ఉదయం 9 గంటల సమయంలో ఎదురుగా మంచిర్యాల వైపు నుండి వస్తున్న ఏపీ 01ఎస్6781 నంబరు గల ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి అట్టి ట్రాక్టర్ ని అతివేగంగా,అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి వెంకటేష్ నడుపుతున్న మోటార్ సైకిల్‌కి టక్కర్ ఇవ్వగా వెంకటేష్‌కి మెడకు తలకు బలమైన గాయాలు అయ్యాయి. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని తండ్రి బుధరపు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య స్వప్న, తల్లి సత్తమ్మ, ఇద్దరు సోదరులు కలరు.

## అక్రమ నిర్మాణంపై మౌనం ఎందుకు?

మందమర్రి, ప్రభాతవార్త



మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి డిటిడిఓకి ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఏఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు అల్లి సాగర్, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ డెమొక్రటిక్ స్టూడెంట్ ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రి పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ భవనం నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మందమర్రి పట్టణంలోని ప్రయివేట్ విద్యాసంస్థకు సంబందించిన యాజమాన్యం కార్పొరేట్ విద్యాసంస్థను మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేయుట కొరకు కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా 1/70యాక్టుకు విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతంలో నిర్మాణం చేపడుతున్నప్పటికి అధికారులు చూసి చూడనట్లు ఉండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని, చర్యలు తీసుకునే అధికారులు ఇంత పెద్ద కమర్షియల్ భవనం నిర్మిస్తున్న పట్టించుకోకపోవడం చాలా శోచనీయం, వెంటనే అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ఐటీడీఏ పీవో ఉట్నూర్, ఐటీడీఏ సెక్రెటరీ హైదరాబాద్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## కౌన్సిలర్ అభ్యర్థులు గడువులోగా ఖర్చుల వివరాలు అందజేయాలి

**- మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్**

క్యాతన్‌పల్లి, మార్చి 18, ప్రభాతవార్త

క్యాతనపల్లికి జరిగిన 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్‌గా పోటీ చేసిన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గడువు లోగా ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13 వెలువడ్డాయాని ఆ రోజు నుండి 45 రోజులలో ఎన్నికల ఖర్చుల వివరాలు ఎలక్షన్ కమిషన్ కు అందజేయాల్సి ఉంటుంది. ఎన్నికల ఖర్చు యొక్క ఫారములు పురపాలక సంఘంలో ఉచితముగా ఇవ్వబడునని తెలిపారు. నిర్ణీత గడువు లోపున ఎన్నికల ఖర్చు వివరాలు క్యాతనపల్లి పురపాలక సంఘం లో సమర్పించని పక్షములో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, తీసుకొనే చర్యలకు అభ్యర్థులు భాద్యులు అవుతారని తెలిపారు.

## మహామ్మాయి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

చెన్నూరు, మార్చి 18, ప్రభాతవార్త

ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ పంచదాయులైన కులస్తులు మహామ్మాయి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని విశ్వబ్రాహ్మణ కులస్తులు అడవికి వెళ్లి తీగదారి పూలను తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా పండగను ఎద్దేశించి వారు మాట్లాడుతూ తీగదారి పూలతో అమావాస్య నుండి మూడు రోజులపాటు మహామ్మాయి అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. తీగదారి పూలను ఇంటికి తీసుకువచ్చి పూలతో ప్రత్యేకంగా మండపాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్ది మండపంలో మహామ్మాయి అమ్మవారిని ప్రతిష్టించి ఈ మూడు రోజులపాటు ఎటువంటి పనులు నిర్వహించకుండా పనిముట్లను మండపంలో పెట్టి వాటిని దేవతలుగా పూజిస్తామన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని ప్రతి ఏటా నిర్వహించడం ఆనవాయితీగా భావిస్తామన్నారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేకంగా తయారుచేసిన పడిని నైవేద్యంగా సమర్పించి మంగళహారతులతో కుటుంబ సభ్యులందరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

## శ్రీ కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

నస్పూర్, మార్చి 18, ప్రభాతవార్త

ఉగాది పండుగ కొత్త ఆరంభాలు, సంతోషం, సమృద్ధికి చిహ్నమని నస్పూర్ శ్రీ కృష్ణవేణి హైస్కూల్ ప్రిన్సిపాల్ దేవన్న పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులకు తెలుగు సంస్కృతి, పండుగల విశిష్టతపై అవగాహన కల్పించేందుకు ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి, లక్ష్మీదేవి పూజలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో దైవానికి భక్ష్యాలు, ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది థీమ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవితంలోని వివిధ అనుభవాలను ప్రతిబింబిస్తాయని విద్యార్థులకు వివరించారు. సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు చేసిన కోలాటం నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ పండగ సరకుల పంపిణీ

మందమర్రి, మార్చి 18, ప్రభాతవార్త

తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు నిత్యాసరసరకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకులు శేరిఫా మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటరీ పరిధి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముస్లిం సోదర సోదరీమణులకు ఈరోజు రంజాన్ పవిత్ర మాస సందర్భంగా సేమ్యా కాజు కిస్మిస్ లాంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలియజేసిన పార్టీ మహిళా విభాగం మహిళలు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.





## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

హాజీపూర్, మార్చి18, ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. బుధవారం రోజున అదనపు కలెక్టర్ చంద్రయ్య 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హాజీపూర్ గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వార్డులలో డ్రైనేజీ పనులు పరిశీలించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగాతెలుసుకున్నారు. హాజీపూర్ సర్పంచ్ మాధవరపు శ్రీలత గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను అదనపు కలెక్టర్ కు వివరించారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల మరమ్మతులు, పారిశుధ్య సమస్యలు వంటి విషయాలను వివరంగా తెలియజేశారు. అదనపు కలెక్టర్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు ఇచ్చి, సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించాలని సూచించారు.



## ధర్మ జాగరణ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

లక్షెట్టిపేట, మార్చి 18, ప్రభాతవార్త

ధర్మజాగరణ ఆధ్వర్యంలో కలసూచి (క్యాలండర్) ఆవిష్కరణ చేసినట్లు సమితి సభ్యులు తెలిపారు. బుధవారం రోజున పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయము ఆవరణలో ధర్మజాగరణ ఆధ్వర్యంలో 2026 క్యాలండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ క్యాలండర్ పూర్తిగా తెలుగు నెలలతోపాటు, తెలుగు తిథుల తో రూపొందించడం జరిగింది. రాను రాను తెలుగు తిథులు మరిచ్చి పోతున్నారని వాటిని మరిచి పోకుండా ఉండడానికే ఈ లాంటి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గొల్ల సిద్దు, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగన్న, తగరపు సత్తయ్య, నాగరాజ్ వర్మ, నరేడ్ల మహేష్, అడ్లూరి దేవయ్య, రాజన్న, గొల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## బోథ్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 18, ప్రభాతవార్త:

బోథ్ నియోజకవర్గంలోని పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. దేగామ, పిప్పలకోటి, రాజురా, గౌలిగూడ ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా దేగామ ప్రాజెక్టు పరిధిలోని 200 కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బోథ్‌లో ఫైర్ స్టేషన్ లేకపోవడం వల్ల నేరడిగొండ మండలం బొరిగామలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తూ.. నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. బోథ్ మండల కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ బిల్లులు వెంటనే విడుదల చేసి, డాక్టర్ల కొరతను తీర్చాలని విన్నవించారు. అలాగే బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఇచ్చోడలో షాదీఖానా నిర్మాణం కోసం 3 కోట్ల రూపాయల ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పత్తి, సోయా రైతులకు సైతం బోనస్ అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి: విట్టల్ రెడ్డి

భైంసా, మార్చి 18, ప్రభాతవార్త:

మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభింపజేయాలని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డికి కుంటాల మండల రైతు సోదరులు వినతిపత్రం అందజేశారు. బుధవారం భైంసా మండల కేంద్రంలోని తన నివాసంలో రైతులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై త్వరలోనే సానుకూల నిర్ణయం రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాటి మహిపాల్, సాయికిరణ్, కుంటాల మండల సీనియర్ నాయకులు తాటి మహేష్, సబ్బిడి గజేందర్, రమణ గౌడ్, రాజేందర్, రాకేష్, సంతోష్ పాల్గొన్నారు.

# పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్

పెంచికల్‌పేట్, మార్చి 18, ప్రభాతవార్త

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామంలో నిండు గర్భిణీ అయిన ఆదివాసి యువతీ ఆత్రం సమ్మక్క (25) ను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. గత నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన కేర్కరి జలపతి, ఏడు నెలల గర్భవతిగా ఉన్న సమ్మక్కను గొంతును నులిమి హత్య చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు ఆదివాసి సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం కేర్కరి జలపతి నాలుగేళ్ల క్రితం సమ్మక్కను ప్రేమ వివాహం చేసుకొని అనంతరం ఆమెను వేధింపులకు గురిచేసి ఇంటి నుంచి పంపించాడు. ఈ ఏడాది మళ్లీ పెళ్లి చేసుకుంటానని నమ్మించి సమ్మక్కను గర్భవతిని చేశాడు. అయితే పెళ్లి చేసుకోవాలని ఆమె ఒత్తిడి చేయడంతో కుల వివక్షతతో హత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై నిజ నిర్ధారణ కోసం ఆదివాసి గోండ్వానా కోయ సంక్షేమ సంఘం, ఆదివాసి మహిళా సంఘం నేతలు బుధవారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడు జలపతి పై మాత్రమే కాకుండా అతనికి సహకరించిన కుటుంబ సభ్యులు ఇతరులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి, నిందితులను తక్షణం అరెస్టు చేయాలి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరపాలి, బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి, 5 ఎకరాల భూమి ఇవ్వాలి, ఆదివాసి మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కుల హత్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సంఘాలు కోరాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన న్యాయం కోసం శనివారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య, గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి మధుకర్, మహిళా నాయకులు పంద్రం పుష్పలత, తోటి శ్రీదేవి, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల వినోద, దుర్గం అనిత, షాహిన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

## మంచి అలవాట్లతోనే మన ఆరోగ్యం పదిలం

- భవిష్యత్తు నిర్మాణం జరగాలంటే ఆరోగ్యంగా ఉండాలి
- పిల్లలు చదువుతోపాటు క్రమశిక్షణతో మెలగాలి
- విద్యార్థులకు ఉపదేశించిన ఆయుర్వేద డాక్టర్ సమీరా రెడ్డి

చెన్నూరు, మార్చి 18, ప్రభాతవార్త

పిల్లలు తమ భవిష్యత్తును నిర్మించుకోవాకంటే ఇప్పటినుండే మంచి అలవాట్లతో పునాది నిర్మించుకోవాలని ఆయుర్వేద నిపుణురాలు డా. సమీరా అన్నారు. మంచిర్యాలజిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక జడ్పీ.హెచ్.ఎస్ టిఎం.ఇఎం చెన్నూరు లో ఏర్పాటుచేసిన మెంటర్ శిప్ పై ప్రకృతి వైద్య చికిత్స నిపుణురాలు డా.సమీరా రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నత స్థాయిలో నిర్మించుకోవాలంటే మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, అధిక ఒత్తిడికి లోనుకాకుండా ఉండడంకోసం యోగా చేయడం, ఆటలు ఆడడం వలన ఒత్తిడినుండి ఉపశమనం కలుగుతుందని అన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు సమయానికి భోజనం చేసే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయ బృందం కలిసి డా. సమీరా రెడ్డిని శాలువాతో సన్మానించారు.




## కెరమెరి వారసంత వేలం రూ. 3.75 లక్షలు

కెరమెరి, మార్చి 18, ప్రభాతవార్త:



మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంత వేలాన్ని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో 10 మంది పాల్గొనగా ఇందులో పెందోర్ వినేష్ వారసంత వేలాన్ని రూ. 3.75 లక్షలు (మూడు లక్షల డెబ్బై ఐదు వేలు)కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సాయిరాం, పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ వెంకన్న, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు రాజ్ కుమార్, మాన్కు, శ్రీకాంత్, సాగర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్సై శ్రీసాయి

నార్నూర్, మార్చి 18, ప్రభాతవార్త:

యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్నూర్ ఎస్సై శ్రీసాయి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సమాజంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తూ, విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణోత్ కావేరి, నార్కోటిక్స్ సీఐ సురేష్, సీడీపీఓ శారద, ఈగల్ ఫోర్స్ టీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీసాయి




## గ్యాస్ వినియోగదారులు ఓపికతో సహకరించాలి: అజయ్ పాఠక్

భైంసా, మార్చి 18, ప్రభాతవార్త:

ఇండియన్ గ్యాస్ వినియోగదారులందరికీ ఐఓసీ బాట్లింగ్ ప్లాంట్ నుండి సిలిండర్ల సరఫరాలో కొంత జాప్యం జరుగుతోందని మేనేజర్ అజయ్ పాఠక్ తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ సంక్షోభం కారణంగా గత 25 రోజులుగా ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ఓపికతో సహకరించాలని కోరారు. సిలిండర్ పొందిన 30 రోజుల తర్వాత మాత్రమే రిజిస్టర్డ్ ఫోన్ నంబర్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మిస్డ్ కాల్ బుకింగ్ కోసం 84549 55555, వాట్సాప్ ద్వారా 75888 88824 నంబర్లకు మెసేజ్ చేయాలన్నారు. ఆల్ ఇండియా ఐవీఆర్ఎస్ బుకింగ్ కోసం 77189 55555 నంబరును వినియోగించుకోవాలని కోరారు. ఆయిల్ కంపెనీ నిబంధనల ప్రకారం డెలివరీ సమయంలో ఓటీపీ తప్పనిసరి అని, బుకింగ్ లేని వారికి సిలిండర్లు సరఫరా చేయబడవని స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా క్రమ పద్ధతిలో అందరికీ అందుతుందని, డెలివరీ సిబ్బందికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సరదా కోసం ఈతకు వెళ్లి ప్రమాదానికి గురి కావొద్దు

## పిల్లలు ఈతకు వెళ్లే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ నితికాపంత్

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త**




విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రారంభమయిన నేపథ్యంలో సరదా కోసం ఈతకు వెళ్లి ప్రమాదానికి గురి కావొద్దని, పిల్లలు ఈతకు వెళ్లే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశముందని హెచ్చరించారు. నీటి లోతు తెలియక జారి పడే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పిల్లలకు ఈత నేర్పించాలనుకుంటే తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. ప్రమాదాలు జరిగాక స్పందించటానికి బదులుగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు సమష్టిగా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచి చదువు మరియు ఇతర సానుకూల కార్యకలాపాలపై దృష్టి పెట్టేలా చేయాలని ఎస్పీ సూచించారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**దస్తురాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:**

రైతులు, పశు యజమానులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ దేవదాస్ సూచించారు. బుధవారం మండలంలోని భూత్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ సింగరి విజయ కిషన్, ఉపసర్పంచ్ గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఈ టీకాల సౌకర్యాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల పశువులకు సోకే వ్యాధులను అరికట్టడానికి ముందస్తు టీకాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్, రమేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాలలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను గురించి తెలుసుకొని వాటిపట్ల సరియైన అవగాహన,దృక్పథం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కళాశాల కామర్స్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ రజిత మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మార్చ్ 15 న ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం జరుపుకుంటారని పేర్కొన్నారు.దీని వల్ల వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకుంటారని వివరించారు.అనంతరం అధ్యాపకురాలు కె. శాంభవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటే మోసాలకు గురికాకుండా ఉంటామని తెలిపారు.అనంతరంకళాశాల విద్యార్థి నదీం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వినియోగదారుల హక్కుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మీనరసింహం అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాల నిర్మూలనపై గ్రామాల్లో అవగాహన సదస్సులు

**నేరడిగొండ, మార్చి 18, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్త మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. నేరడిగొండతో పాటు వడ్డూర్, తేజాపూర్, కోర్టికల్ (బి) గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. డీఎస్పీ శివ నాయుడు, ఇచ్చోడ సీఐ రమేష్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఈ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రాణాంతక అనర్థాల గురించి వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ

## గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



**సారంగాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:**

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాబోయే బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ బృందం మంత్రికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను మంత్రికి వివరించారు. ఈ విజ్ఞప్తిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ప్రతినిధులు తెలిపారు. ఈ బృందంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల ఉన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

## పశువులకు టీకాల కార్యక్రమం

**జైనూర్, మార్చి 18, ప్రభాతవార్త:**

కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఉషగాంలో బుధవారం జైనూర్ పశువైద్యాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పశువులకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ రాథోడ్ సికిందర్ సర్పంచ్ ఆత్రం నిర్మల శశిపాల్‌తో కలిసి పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సికిందర్ తెలిపారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా ఈ టీకాలు వేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రకాష్, మంగీలాల్, రైతులు పాల్గొన్నారు.



మ్యూజియంను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## గిరిజన మ్యూజియం ప్రారంభించిన కలెక్టర్

**నార్నూర్, మార్చి 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గిరిజన మ్యూజియంను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సర్పంచ్ బాణోత్ కావేరి బుధవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గిరిజన ఆదివాసీ సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ మ్యూజియంను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అంతకుముందు కలెక్టర్‌కు సర్పంచ్ కావేరి శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి మరింత సహకరించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించి, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్, డీఎల్‌పీఓ ప్రభాకర్, ఐటీడీఏ ఈఈ తానాజీ, తహశీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ గంగాసింగ్, వివిధ గ్రామాల సర్పంచులు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## మండల ఉపసర్పంచుల సంఘ కార్యవర్గం ఎన్నిక

**సారంగాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:**

మండలంలోని ఉపసర్పంచుల సంఘ కార్యవర్గం బుధవారం 23 గ్రామ పంచాయతీలలో ఉపసర్పంచులను ఎన్నుకున్నారు. మండల ఉపసర్పంచుల అధ్యక్షుడిగా కౌట్ల (బి) గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా రామ్ సింగ్ తండాకు చెందిన రాథోడ్ ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా వెలుమల ప్రశాంత్, కోశాధికారిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధి కోసం ఉపసర్పంచులందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈఏపీసెట్, టీటీసీలకు ఉచిత శిక్షణ

ఇచ్చోడ, మార్చి 18, ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈఏపీసెట్ 2026 షార్ట్ టర్మ్ కోర్సుతో పాటు, టీటీసీ ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఈ నెల 23 నుండి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఈ శిక్షణ అందించబడుతుందని వారు పేర్కొన్నారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నతమైన విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సీట్లు సాధించాలని కెరీర్ గైడెన్స్ విభాగం ప్రతినిధులు కోరారు. ఇతర వివరాల కోసం ఈ. నరసయ్య (9493430265), జై. తిరుపతి (7981155469) నంబర్లను సంప్రదించాలని సూచించారు.



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

## ఆదివాసీ గర్భిణీ హత్యపై ఆగ్రహం

### - నిందితుడికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్

పెంచికల్‌పేట్, మార్చి 18, ప్రభాతవార్త :

మండలంలోని కొండపల్లి గ్రామంలో ఐదు రోజుల క్రితం జరిగిన ఆదివాసీ మహిళ ఆత్రం సమ్మక్క హత్య ఘటనపై ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భాధిత కుటుంబాన్ని బుధవారం సీపీఎం, ట్యాగ్స్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కూషన రాజన్న మాట్లాడుతూ సమ్మక్కను ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేశారాని, ఆమె ఏడు నెలల గర్భిణీ కావడంతో రెండు ప్రాణాలు కోల్పోయాయని పేర్కొన్నారు. అందువల్ల నిందుతుడు కేర్కర్ జలపతి పై రెండు హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడికి కఠినంగా శిక్ష అమలు చేయాలన్నారు. అధికార ప్రజాప్రతినిధులు గ్రామాన్ని సందర్శించి కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, ట్యాగ్స్ జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు

ఇచ్చోడ, మార్చి 18, ప్రభాతవార్త:

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ నార్కోటిక్ బ్యూరో ఈగల్ టీం డీఎస్పీ బుచ్చయ్య, ఇచ్చోడ సీఐ బండారి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ బుచ్చయ్య మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను, వాటికి బానిసైన వారి ప్రవర్తన వల్ల సమాజానికి ఎదురయ్యే సమస్యలను వివరించారు. గంజాయి సాగు లేదా విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే 1908 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. పోలీసులకు తుపాకీ, లాఠీ ఆయుధాలైతే, విద్యార్థులకు 112, 1908 నంబర్లు ఆయుధాలని పేర్కొన్నారు. విద్యార్థులకు లేదా మహిళలకు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే 112 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలతో పాటు నర్సాపూర్, సిరిచల్మ గ్రామాల్లోనూ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ బుచ్చయ్య, సీఐ బి.రాజు

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### - మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, వైస్ చైర్మన్ డా. అనిత

### - పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం పీఆర్‌టియూ తెలంగాణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సంబరాలు ఘనంగా నిర్వహించా. ఈ కార్యక్రమూనికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు రాజకీయ,క్రీడా ,అంతరిక్ష రంగాలతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. ఖగమహిళలు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని. మహిళలకు మద్దతు ఇద్దాం, వారి హక్కులను కాపాడదాం, సమానత్వం సాధించడానికి కృషి చేద్దాం అన్నారు. గురువులుగా మీరు మహిళలకు ప్రేరణ, మార్గదర్శకులు. మహిళలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలని కోరినారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కటుకం మధుకర్, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంబురాల్లో పాల్గొన్న వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుర హాస్పిటల్ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రుక్మిణి, పీఆర్‌టియు తెలంగాణ మహిళా నాయకులు గాయత్రి, రజియా సుల్తానా, సుమిత్ర, పూర్ణిమ, ఉమారాణి, శోభారాణి, ఝాన్సీ ,మాధవి, చంద్రకళ,ఫరిద, రమాదేవి,త్రివేణి, లక్ష్మీప్రసన్న, లావణ్య, సుప్రియ,తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్,వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు

# రంగయ్య మాస్టారు సేవలు అభినందనీయం

### - కేంద్ర సలహాదారులు అమిత్ కటోచ్ - సావర్ కేడ పాఠశాలను సందర్శన




పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కేంద్ర సలహాదారులు అమిత్ కటోచ్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కేంద్ర సలహాదారులు అమిత్ కటోచ్

కెరమెరి, మార్చి 18, ప్రభాతవార్త:

కాదేర్ల రంగయ్య మాస్టారు సేవలు అభినందనీయమని కేంద్ర సలహాదారులు అమిత్ కటోచ్ అభినందించారు. బుధవారం న్యూఢిల్లీ నుండి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్ కేడ గ్రామంలో పిఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో సందర్శించి పి ఎం సి పాఠశాలలో నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 4,5వ తరగతుల విద్యార్థులతో సంభాషించారు. పాఠశాలలో ఉన్న వంట గది ప్రాకృతిక ఉద్యానవనం క్రీడా పరికరాలను పరిశీలించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామస్తుల సహకారాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి. ఏఎంఓ సతీష్. డిఈఓ లలిత, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈఓ ఆడే ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పౌనూర్ గ్రామపంచాయతీని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

జైపూర్, మార్చి 18, ప్రభాతవార్త

జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు బుధవారం ఆకస్మికంగా జైపూర్ మండలంలోని పౌనూర్ గ్రామపంచాయతీని సందర్శించి, గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్టాట్యూటరీ, వాటర్ సప్లై రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్లు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు.గ్రామపంచాయతీలో జరుగుతున్నటువంటి పారిశుద్య పనులను పరిశీలించి, గ్రామపంచాయతీ సేగ్రిగేషన్ షెడ్‌ని సందర్శించి గ్రామపంచాయతీ నుండి సేకరిస్తున్నటువంటి తడి, పొడి చెత్తను వేరు చేయాలని తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని అదేవిధంగా పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డు పంపే విధంగా చూడాలన్నారు. అనంతరం స్మశాన వాటికను సందర్శించి చుట్టూ ఎటువంటి పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంపై పంచాయతీ కార్యదర్శి పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో సానిటేషన్ పనులు ముమ్మరంగాఈ చేయించాలన్నారు. అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి, అందజేస్తున్న పౌష్టిక ఆహారం గురించి వివరాలు తెలుసుకొని, కోడి గుడ్డు ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, సర్పంచ్ శ్రీమతి వేముల సుధా, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

